## బాధ్యతగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్, జూన్ 19: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని మాజీ కార్పొరేటర్ శ్రీనివాస రెడ్డి కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ముషీరాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలు కాలుష్య కోరల్లో చిక్కుకోకుండా ముప్పును తప్పించడానికి ప్రతి ఒక్కరూ తమ ఇళ్లు, పరిసరాల్లో మొక్కలు నాటాలని కోరారు. మొక్కల పెంపకం ద్వారానే కాలుష్య సమస్య తగ్గుముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయిని దేవేందర్‌రెడ్డి, భిక్షపతి యాదవ్, నేత శ్రీనివాస్, రేషం మల్లేశ్, వెంకటేశ్వరరావు, బాల్‌రాజ్ గౌడ్, సిరిగిరి శ్యామ్, కిరణ్, కల్పన, రేఖ, సాయి యాదవ్, రాహుల్ పాల్గొన్నారు.

## పోరాట యోధులకు ఆదర్శం 'పుచ్చలపల్లి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి

ముషీరాబాద్, జూన్ 19: పేదల పక్షాన అలుపెరుగని పోరాటం చేసిన మహనీయుడు పుచ్చలపల్లి సుందరయ్య అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి అన్నారు. మార్క్సిజం నమ్మిన సిద్ధాంతంతో జీతాంతం ఒకే పంథా కొనసాగించిన పుచ్చలపల్లి ఎందరో పోరాట యోధులకు ఆదర్శనీయులని కొనియాడారు. చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పుచ్చలపల్లి సుందరయ్య పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయిత వడ్డేపల్లి కృష్ణ, విశ్రాంత న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్, ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు తిరువాణి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఎస్‌ఆర్‌టీ స్థలాన్ని కాపాడాలని వినతి

ముషీరాబాద్, జూన్ 19: రాంనగర్ డివిజన్ ఎస్‌ఆర్‌టీ కాలనీలోని ప్రభుత్వ ఖాళీ స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరుతూ సోమవారం ఎస్‌ఆర్‌టీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌రావు సోమవారం లేబర్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందచేశారు. కాలనీలో 1-71046/8/1 ఇంటి నంబర్ వెనుక భాగంలో కొంతమంది కబ్జాదారులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కార్మిక శాఖ కమిషనర్‌ను కలిసిన వారిలో కాలనీ వర్కింగ్ ప్రెసిడెంట్ శశికళ, బల్వీర్‌కుమార్, మధుబాబు, లక్ష్మి, నఫీసా, రేణుక, ఎస్తేర్‌రాణి ప్రభు ఉన్నారు.

## కొండా సరోజిని సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి,జూన్19 : ప్రముఖ సంఘ సేవకురాలు కొండా సరోజిని సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లి వీఎస్‌టీ ఫంక్షన్ హాల్లో సరోజిని సంతాప సభను నిర్వహించారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహ, సతీశ్, అశోక్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నృత్యోత్సవాలు

ముషీరాబాద్, జూన్ 19: సాయి స్వరని మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా నిర్వహించిన నృత్యోత్సవాలు ఆకట్టుకున్నాయి. నృత్య గురువులు శ్రీనివాస్, తేజస్వినిల ఆధ్వర్యంలో శిక్షణ పొందిన చిన్నారుల, గాయనీ, గాయకులు, నృత్య కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు శ్రోతలను అలరించాయి. కార్పొరేటర్ జ్యోత్స్న నృత్యకారులను అభినందించారు.

# హరితహారంతో ఆకుపచ్చ తెలంగాణ

- మొక్కలు నాటి సంరక్షించాలి
- హరితోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి,జూన్19 : సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన హరితహారంతో నేడు ఆకుపచ్చని తెలంగాణ ఆవిష్కృతమైందని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణ బాధ్యతలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలో హరితోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే తెలంగాణ దశాబ్ది పార్క్‌ను(ఎల్ఐజీ -2 పార్క్) ప్రారంభించారు.ఈ సందర్భంగా డీఎంసీ తిప్పర్తి య్యాదయ్య, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్, నోడల్ ఆఫీసర్ పవన్ కుమార్, యువజన విభాగం నాయకుడు ముఠా జయసింహలతో కలిసి మొక్కలను నాటారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భావితరాలకు స్వచ్ఛమైన , ఆకుపచ్చని తెలంగాణను అందించాలనే సంకల్పంతో చేపట్టిన హరితహారం కొనసాగుతుందని అన్నారు. సీఎం కేసీఆర్ మానసపుత్రిక హరితహారం అని పేర్కొన్నారు. ఎనిమిదేండ్లలో పెద్ద ఎత్తున మొక్కలు నాటినట్లు తెలిపారు. దీని ఫలితంగా అటవీ విస్తీరణం పెరిగిందని వివరించారు. నేడు వరల్డ్ గ్రీన్ సిటీగా గుర్తింపు వచ్చిందన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ,పార్టీ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోజస్, దామోదర్‌రెడ్డి, వెంకటకృష్ణరావు,యూబీడీ సర్కిల్-15 మేనేజర్ భాస్కర్, ఎంఐజీ 2 పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు,రత్నాకర్, తెలంగాణ హౌస్‌ఫెడ్ డైరెక్టర్ కిషన్ రావు, బీఆర్ఎస్ నాయకులు టెంపుల్ జనార్దన్, ముదిగొండ మురళీ, ఎంవీ జనార్దన్ , ఎర్రం శ్రీనివాస్ గుప్తా, రమేశ్‌రెడ్డి, రవి శంకర్ గుప్తా, కిరణ్, పీఎస్ శ్రీనివాస్, రాజ్‌కుమార్, ప్రవీణ్,సంతోష్‌గౌడ్,శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, సీపీఐ నాయకుడు వెంకట్ స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

### ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

చిక్కడపల్లి,జూన్19: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. చిక్కడపల్లి పోలీస్ స్టేషన్‌లో సీఐ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు, ఎస్పీ రమణా రెడ్డి, ఏసీపీ యాదగిరితో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న హరితహారం కార్యక్రమంలో మంచి ఫలితాలు వస్తున్నాయని అన్నారు.

- హరితహారం కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ డివిజన్ కెనరా బ్యాంక్ పార్క్‌లో సోమవారం డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ మొక్కలు నాటారు. పర్యావరణ సంరక్షణలో భాగంగా డివిజన్ పరిధిలో ఉన్న పార్కుల్లో పచ్చదనం పెంచడం జరుగుతుందని తెలిపారు. ఉదయం సాయంత్రం పార్కుల్లో వాకింగ్ చేసుకునే విధంగా పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ జీహెచ్‌ఎంసీ వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రవీణ్ చంద్ర, బీజేపీ నాయకుడు వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డీసీపీ వెంకటేశ్వర్లు,ఎస్పీ రమణారెడ్డి



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ పావని,అధికారులు

# తిరుగులేని శక్తిగా బీఆర్ఎస్

ముషీరాబాద్, జూన్ 19: పటిష్టమైన కార్యకర్తలతో బీఆర్ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా అవతరించిన పార్టీ రానున్న రోజుల్లో దేశానికి దిశ దశ చూపే రాజకీయ శక్తిగా ఆవిష్కృతం అవుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని దేశ ప్రజలు గమనిస్తున్నారని, ఇదే తరహా అభివృద్ధిని దేశ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సోమవారం అడిక్‌మెట్ అంబర్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో 2024 ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వివిధ రాష్ట్రాల్లో ప్రజల మద్దతుతో సత్తా చాటనున్నదని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం, అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. నిత్యం ప్రజల మధ్య ఉండి పార్టీని మరింత పటిష్టపర్చాలని కోరారు. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధిని ప్రజల ముందుంచాలని, తద్వారా వారి ఆదరణను చూరగొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రామాలయం చైర్మన్ రవి యాదవ్, సురేందర్, శ్యామ్‌సుందర్, మాధవ్, లక్ష్మీపతి, మామిడి శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

### ఉద్యమకారుడు సూర్యనారాయణకు సన్మానం

ముషీరాబాద్, జూన్ 19:తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాంనగర్ డివిజన్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు గజ్జెల సూర్యనారాయణను సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముఠా జయసింహ, రావులపాటి మోజస్, శ్యామ్ యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, గజ్జెల సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### భవనంపై నుంచి దూకి

# తల్లి, పిల్లలు ఆత్మహత్య

ముషీరాబాద్, జూన్ 19: అదనపు కట్నం తీసుకుకావాలంటూ భర్త పెట్టే వేధింపులు భరించలేక ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గాంధీనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది.భర్త పెట్టే వేధింపులు భరించలేక పుట్టింటికి వచ్చిన మహిళ తమ తల్లిదండ్రులు నివాసముంటున్న భవనం ఎనిమిదో అంతస్తు నుంచి తన ఇద్దరు పిల్లలను తోసివేసి ఆ తరువాత తాను కిందకు దూకింది. కళ్లుమూసి కళ్లు తెరిచే లోపే ఒకరి తరువాత ఒకరూ ప్రాణాలు వదిలారు. క్షణాల వ్యవధిలోనే ఒకరి తరువాత ఒకరు భవనం పైనుంచి పడి చనిపోయిన ఘటనను చూసిన స్థానికులు ఆందోళనకు గురయ్యారు. గాంధీనగర్ పోలీసుల కథనం ప్రకారం ..బోడుప్పల్‌కు చెందిన గణేశ్‌తో బన్సీలాల్‌పేట్ జీవై దొడ్డి డబుల్ బెడ్రూం కాలనీకి చెందిన సౌదర్య(28)కు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర వయసున్న ఇద్దరు కవల పిల్లలు నిత్యా, నిదర్శన్ ఉన్నారు. 20 రోజుల క్రితం భర్తతో గొడవ పడిన సౌందర్య జీవై దొడ్డిలోని పుట్టింటికి వచ్చింది. సోమవారం తిరిగి భర్త గణేశ్ వద్దకు వెళ్లగా ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. దీంతో మనస్తాపానికి గురైన ఆమె తిరిగి పుట్టింటికి వచ్చింది. భర్త ఇటీవల అదనపు కట్నం కోసం నిత్యం వేధింపులకు గురి చేస్తుండటంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె మధ్యాహ్నం తన ఇద్దరు పిల్లలతో కలిసి జీవైదొడ్డిలోని డబుల్‌బెడ్రూం భవనం అంతస్తు పైకి ఎక్కి పిల్లలను కిందకు తోసివేసి ఆమె దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.